శుద్ధజలమే లక్ష్యం

● నీటి సమస్యకు తక్షణ పరిష్కారం దిశగా చర్యలు
● మంచినీటి సహాయకులకు శిక్షణ



నిర్మల్, న్యూస్‌టుడే: ఇంటింటా శుద్ధ జలం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కన్నీటి కష్టాలను అధిగమించడంతో పాటు నాణ్యమైన నీటిని అందించేందుకు రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్రంలో మిషన్ భగీరథ శుద్ధజలం సరఫరాపై దృష్టి సారించింది. పల్లెల్లో నీటి ఇబ్బందులు రాకుండా ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించుకునేలా ప్రణాళిక రూపొందించి పంచాయతీల్లో మంచినీటి సహాయకులను నియమించింది. తాగునీటి సరఫరా, పథకాల మరమ్మతులపై శిక్షణ ఇస్తోంది.

శిక్షణ అంశాలు

- నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు గుర్తించి వాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకరావడంతోపాటు విడిభాగాలపై అవగాహన
- నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్
- బోరు మోటారు పని తీరుపై అవగాహన. స్టార్టర్, ఫ్యూజు పోతే మరమ్మతులు
- లీకేజీ పైపులు తొలగించి కొత్తవి వేయడం, పగిలిన పైపులను అతికించడం
- శుద్ధనీరు సరఫరా చేసే పైపుల లీకేజీలు గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయడం
- మురుగుకాలువల్లో పైప్‌లైన్లు లేకుండా చూడటం

జిల్లా వివరాలు

జిల్లా : నిర్మల్

గ్రామీణ మండలాలు	18
గ్రామాలు	396
చేతి పంపులు	2,167
ఆవాసాలు	708
రక్షిత మంచినీటి పథకాలు	1,013
పైప్‌లైన్ల విస్తీర్ణం	1,970.2 కిలోమీటర్లు
బోరుబావులు, పంపుసెట్లు	2,742
ఇంటింటి కనెక్షన్లు	1,64,759
మంచినీటి సహాయకులు	404

పంచాయతీకి ఒకరు

పల్లెల్లో తరచూ తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు, చేతి పంపుల చెడిపోవడం, మోటార్లు పనిచేయకపోవడంతో శుద్ధనీరు సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెంటనే వాటికి మరమ్మతులు చేయించేందుకు అందుబాటులో సిబ్బంది లేకపోవడంతో నీటి సరఫరాలో ఇక్కట్లు ఏర్పడ్డాయి. పైప్‌లైన్ లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా కావడంతో వాటిని తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటన్నింటికి పరిష్కారం చూపించడానికి పంచాయతీకి ఒకరు, మేజర్ పంచాయతీలకు ఇద్దరు చొప్పున మంచినీటి సహాయకులను నియమించారు. జిల్లాలోని 396 పంచాయతీలకు 404 మంది సహాయకులను అర్హత ఆధారంగా ఎంపిక చేశారు. బహుళ నైపుణ్యం ఉన్న కార్మికులు (మల్టీ స్కిల్ వర్కర్స్)ను తీసుకుని శిక్షణ ఇస్తున్నారు.

త్వరితగతిన పరిష్కారం :

సందీప్, ఈఈ, మిషన్ భగీరథ

శుద్ధనీరు సరఫరా విషయంలో ఆటంకాలు ఏర్పడితే ఇకపై త్వరగా పరిష్కారమవుతాయి. గ్రామాల్లో నిరంతరం సహాయకులు అందుబాటులో ఉండనుండటంతో సేవలు మరింత మెరుగ్గా అందుతాయి. తాగునీటి పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రజలకు సకాలంలో శుద్ధనీరు సరఫరా జరుగుతుంది.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పి.రవి తెలిపారు. ప్రియదర్శినినగర్, సాగర్‌కాలనీ, మస్తాన్‌సాహెబ్ దర్గా, తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

సైబర్ వల.. కాసుల కాజేత

● ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత అవసరం

☛ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ యువకుడికి ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీ నుంచి చరవాణులపై 40 శాతం ఆఫర్లు ఉన్నాయంటూ సందేశం వచ్చింది. దీంతో ఆ యువకుడు కంపెనీ పంపిన వివరాలకు అనుగుణంగా బ్యాంకు ఖాతా ద్వారా రూ.35 వేలు పంపించాడు. వారం రోజులు గడిచినా తనకు ఎలాంటి పార్సిల్ రాకపోవడంతో సంస్థ చూపిన చరవాణికి నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని తెరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



☛ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామకు చెందిన ఉదయ్ ఓ చరవాణి ఆర్డర్ చేయగా మంగళవారం మధ్యాహ్నం డెలివరీ బాయ్ వచ్చి అందించాడు. అతడి సమక్షంలో తెరిచి చూడగా రాళ్లు, సబ్బు బిళ్ల వచ్చాయి.



మంచిర్యాల నేరవిభాగం, చెన్నూరు, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు రానున్నాయి. పండగలంటే నూతన వస్త్రాలు, అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఆఫర్ల పేరుతో వల వేయనున్నారు. ఆకట్టుకునే ప్రకటనలకు ఆశపడితే మొదటికే మోసపోయే ప్రమాదం లేకపోలేదు. అనవసరపు లింక్‌లకు క్లిక్ చేస్తే మనం తేరుకునే లోపే ఖాతాలు ఖాళీ అవుతాయి.

పండగ పూట.. పారాహుషార్

ఉమ్మడి జిల్లాలో సగటున సాధారణ రోజుల్లో సుమారు రూ.25 లక్షల వరకు ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతుంది. పండగ వేళ రోజుకు ఇది రూ.50 లక్షల వరకు జరుగుతుంది. ఈ సమయంలో ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, తదితర సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరుతో ప్రకటనలు పంపిస్తారు. చరవాణులు, దుస్తులు, చేతిగడియారాలు, తదితర అలంకరణ వస్తువుల లోగోలను పంపి మార్కెట్ ధర కంటే 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ మాయ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఉండగానే వస్తువు కొనుగోలు చేయాలని సమయం మించిపోతుందని తొందరపెడతారు. అలాగని మన బ్యాంకు ఖాతా వివరాలు పంపిస్తే డబ్బులు మాయమవుతాయి. మంచిర్యాల జిల్లాలో జనవరి 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 122 సైబర్‌క్రైం కేసులు నమోదయ్యాయి.

తక్కువ ధరలంటే నమ్మవద్దు

సైబర్ మోసగాళ్లు భారీ ఆఫర్లు ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రకటనలు ఇస్తారు. మార్కెట్‌లో రూ.లక్షకు పైగా ఉన్న చరవాణులపై 75 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రచారం చేస్తారు. వీటిని నమ్మి మోసపోవద్దు. నమ్మకమైన వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. డెలివరీ సమయంలో వీడియో రికార్డు చేసి ఉంచుకోవాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు

సైబర్‌క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుకుంటున్నారు. ఖాతా నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే కేంద్రహోంశాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి.

మంత్రి సీతక్క హామీతో కార్మికుల సమ్మె విరమణ

నిర్మల్ పట్టణం, నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు ఈనెల 1 నుంచి సమ్మె చేస్తున్నారు. జిల్లా పాలనాధికారి సెలవులో ఉండటంతో పారిశుద్ధ్య కార్మికులు బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిలను కలుసుకున్నారు. వారి సమక్షంలోనే ఎస్పీ చరవాణిలో మంత్రి సీతక్కతో మాట్లాడారు. సమ్మెతో కలుగుతున్న ఇబ్బందులు, కార్మికుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా ఒకనెల వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారు. మిగతా వేతనాలు సకాలంలో అందేలా చూస్తామని భరోసా కల్పించారు. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. సత్వరమే స్పందించి సమస్య పరిష్కారానికి సహకరించిన ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

అధిక వెసులుబాటు లేకనే జీతాల చెల్లింపులో జాప్యం: పుర ఛైర్మన్

నిర్మల్ అర్బన్: ఒప్పంద కార్మికులు, సిబ్బంది సమ్మె విరమించాలని నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ కోరారు. బుధవారం పుర కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పన్నుల రూపంలో ఏటా రూ.6 కోట్లు వసూలైతే అందులో జీతాలు, డీజిల్, కరెంటు బిల్లులు తదితర వాటి ఖర్చులకే సుమారు రూ.11 కోట్లు అవుతుందని చెప్పారు. భారాస హయాంలో పట్టణ ప్రగతిలో నెలకు రూ. 82 లక్షలు మంజూరయ్యేవని, దీంతో కొంత వెసులుబాటు అయ్యేదని పేర్కొన్నారు. ఇక్కడే కాకుండా ఇంకా ఇలా 64 పురపాలికల్లో బడ్జెట్ ఇబ్బందులున్నాయని, కొన్ని చోట్ల 5 నెలలుగా వేతనాలు ఇవ్వని పరిస్థితి ఉందని వెల్లడించారు. ఒక నెల జీతాలు ఖాతాల్లో జమ చేశామని, మిగతా వాటిని నవంబరు 5లోగా అందించేందుకు వారితో ఇప్పటికే సంప్రదించామన్నారు. దసరా పండగ కోసం ఒక్కొక్కరికీ రూ.5వేలు కావాలని అడగగా, రూ.4వేలు ఇచ్చేందుకు అంగీకరించామని అన్నారు. అయినా సమ్మె కొనసాగించడం వెనుక ఎవరున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. స్వచ్ఛ భారత్ పేరిట దేశంలో కార్యక్రమాలు చేపడుతుంటే ఇక్కడి భాజపా నాయకులు చెత్త తీసుకొచ్చి కార్యాలయం ఆవరణలో వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇటీవల శిబిరాన్ని సందర్శించి, కార్యాలయానికి రాగా పూర్తి వివరాలు తెలియజేశామని చెప్పారు. దసరా, దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కార్మికులు, సిబ్బంది సమ్మెను విరమించి పనుల్లోకి రావాలని ప్రత్యేకంగా కోరుతున్నానని అన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. పత్తి పంట అమ్మడానికి వచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలు పనిచేస్తున్నాయా లేదా చూసుకోవాలని సూచించారు. రైతులు తమ ఆధార్‌కార్డుకు చరవాణి నెంబరు అనుసంధానం ఉండాలని చెప్పారు. పత్తి పంట విక్రయానికి వచ్చే సమయంలో తమ వెంట చరవాణితో పాటు రెండు కాపీల పట్టా పాసు పుస్తకాల జిరాక్స్‌లు, ఆధార్‌కార్డు, కౌలు రైతు ఉంటే సంబంధిత వ్యవసాయాధికారి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. పత్తి సాగు చేసిన రైతులు, వారి రక్త సంబంధీకులు మాత్రమే పంట అమ్మడానికి సీసీఐ కేంద్రాలకు రావాలని, ఇతర వ్యక్తులు తీసుకొస్తే కొనుగోలు చేయమని పేర్కొన్నారు.

బాసర ఆలయం కిటకిట



గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాసర ఆలయంలో బుధవారం ఆధ్యాత్మికత సంతరించుకుంది. వేద మంత్రాలు, గోదావరిలో పుణ్యస్నానాలు, సరస్వతి అమ్మవారికి భక్తుల మొక్కులు, చిన్నారులకు అక్షరాభ్యాసాలతో సందడి నెలకొంది. గతేడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య పడిపోయింది. అక్షరాభ్యాసాలూ తగ్గాయి.

– బాసర, న్యూస్‌టుడే

సీఎం చేతుల మీదుగా 9 మందికి నియామక పత్రాలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాలోని 278 మంది అభ్యర్థులు హైదరాబాద్ తరలివెళ్లారు. బుధవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి నిర్మల్, ఖానాపూర్ ప్రాంతాలకు చెందిన వారి కోసం అయిదు బస్సులు ఏర్పాటు చేశారు. డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన 9 మందికి నియామకపత్రాలు అందజేశారు. మిగతా వారికి జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు.

రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

ముథోల్: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. రూ.30 కోట్ల నిధులతో చేపట్టనున్న రహదారికి బుధవారం ముథోల్‌లో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు 14 గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించడానికి కేంద్ర ప్రభుత్వ నిధులతో ముథోల్ నుంచి లోకేశ్వరం మండలం వాస్తాపూర్ వరకు రహదారికి నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ఈ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ ప్రజలకు నిజామాబాద్ వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. వచ్చే సంవత్సరం నాటికి పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఎంపీ నగేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపడుతామని వెల్లడించారు. భైంసా మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాజేష్‌బాబు, భైంసా పుర మాజీ అధ్యక్షుడు గంగాధర్, భాజపా నాయకులు నారాయణరెడ్డి, నర్సాగౌడ్, సాంవ్లి రమేష్, పోతన్న, సతీష్ రెడ్డి, భూమేష్, తాటివార్ రమేష్, భోజన్న పాల్గొన్నారు.



ముథోల్‌లో భూమి పూజ చేస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్

ముగిసిన ప్రజావేదిక

● రూ.30,691 రికవరీ, రూ.2 వేల జరిమానా

ముథోల్, న్యూస్‌టుడే: గత ఆర్థిక సంవత్సరంలో రూ.3.9 కోట్ల ఉపాధిహామీ నిధులతో ముథోల్ మండలంలో చేసిన పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీ చేశారు. తనిఖీ నివేదికపై ముథోల్ మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సభ జరిగింది. మస్టర్లలో దిద్దుబాటు, తప్పులు, హరితహారం మొక్కలు చనిపోవడం వంటివి సామాజిక బృంద సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. పనులకు వచ్చిన కూలీలకు డబ్బులు రాలేదన్నారు. ఆయా అంశాలపై డీఆర్‌డీఓ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి తప్పులు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక నిపుణుల నుంచి రూ.30,691 రికవరీకి ఆదేశించారు. రూ.2వేల జరిమానా విధించారు. ఎంపీడీఓలు శివకుమార్, సురేష్‌బాబు, ఏపీఓ శిరీషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ముథోల్(బాసర): మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ విజయలక్ష్మి అన్నారు. బాసర మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏపీఎం గురుచరణ్, ఏపీఓ చారి, ఐకేపీ సీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర.. కాకూడదు దగా

● ఇప్పుడే చక్రం తిప్పుతున్న వ్యాపారులు

ఈటీవీ – ఆదిలాబాద్


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 10.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 71.05 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.7521గా నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రూ. 7,700 పైచిలుకు ధర పలుకుతోంది. ఒకవేళ ఇదే ధర కొనసాగితే భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. సీసీఐ పోటీ లేకపోతే నాణ్యత, తేమ పేరిట రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఆదిలాబాద్, భైంసా, జైనూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో సిండికేట్‌గా ఉన్న కొందరు ప్రైవేటు వ్యాపారులు ఇప్పటికే సీసీఐ పాత్రను పరిమితం చేయటం కోసం ప్రయత్నాలు చేస్తున్నందునే కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాలేదని తెలుస్తోంది.



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు

సీసీఐ పాత్ర ఏమిటి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీఐ రెండు విధాలుగా పత్తి కొనుగోళ్లు చేయడానికి వెసులుబాటుంది. మొదటిది బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువ ధరతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుంటే సీసీఐ రంగంలోకి దిగాలి. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోళ్లు చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలి. రెండోది ప్రైవేటు వ్యక్తులతో పోటీ పడి కొనుగోళ్లు చేయటం. వ్యాపారులు ఏకమైతే సీసీఐ వల్ల రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ ఆ సంస్థ ఇప్పుడు రంగంలో ఉంటుందా? లేదా? అనేది అనుమానాలకు తావిస్తోంది.



నేతలతో సమాలోచన

దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిధిలోనే అత్యధికంగా పత్తి అమ్మకానికి వస్తోంది. మంచిర్యాల జిల్లాలో చివరిస్థానంలో నిలుస్తోంది. ధర నిర్ణయంలో వ్యాపారుల మాట చెల్లుబాటవుతోంది. ఆదిలాబాద్, భైంసా, ఆసిఫాబాద్‌లో కొంతమంది నేతలతో వ్యాపారులు అంతర్గత సమాలోచనలు చేయటం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఒకవేళ నేతలు ఒత్తిడి చేస్తే ఇప్పటికే కొనుగోళ్ల ముహూర్తం ఖరారయ్యేది. కానీ అలా జరగటం లేదు. పత్తి వ్యాపారంలో చక్రం తిప్పడంలో అనుభవం కలిగిన భైంసాకు చెందిన కొందరు నేతల పాత్ర కీలకంగా ఉన్నట్లు వ్యాపార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఆదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అఖిలపక్ష నేతలను మినహాయిస్తే ప్రజాప్రతినిధులెవరూ పత్తి కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవటం విమర్శలకు తావిస్తోంది

పన్నులు వసూలు చేయాలి


ఖానాపూర్ గ్రామీణం: పంచాయతీల్లో పన్నులను క్రమం తప్పకుండా వసూలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఎల్పీవో రమేష్‌లు సూచించారు. మండలంలోని సత్తనపల్లి రైతు వేదికలో బుధవారం ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో పచ్చదనం, రికార్డుల నిర్వహణ, నూతన ఇంటి నిర్మాణాలకు అనుమతులు, నాలా సంబంధిత విషయాలపై పలు సూచనలు చేశారు. ఎంపీవోలు రత్నాకర్‌రావు, అనిల్, కవిరాజ్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

కుభీరు: పంచాయతీల్లో ఇంటిపన్ను వసూళ్లపై దృష్టిసారించాలని ఎంపీడీఓ నవనీత్‌కుమార్ కార్యదర్శులకు సూచించారు. బుధవారమిక్కడ ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకం

నిర్మల్, న్యూస్‌టుడే: దసరా పండగ వేళ నామినేటెడ్ పదవుల భర్తీ కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు నింపుతోంది. రెండు రోజుల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సయ్యద్ అర్జుమంద్‌అలీని ప్రకటించగా.. బుధవారం రాత్రి జిల్లాలోని నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



సోమ భీంరెడ్డి



అబ్దుల్ హాది

● నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నిర్మల్ గ్రామీణ మండలం మేడిపెల్లికి చెందిన మాజీ సర్పంచి సోమ భీంరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన ఈటెల శ్రీనివాస్‌ను నియమించింది. సభ్యులుగా జి.గజేందర్, జి.గంగారాం, కె.రాజరెడ్డి, వంజరి రూప, ఎం.ఎ.అజీం, సి.మురళి, పి.వంశీకృష్ణ, నిమ్మ సాయన్న, ఆర్.వెంకటేశ్, సుంకరి సురేశ్, సయ్యద్ ఖలీల్, మంత్రి రాజ్‌గోపాల్, మూక్తాపూర్ పీఏసీఎస్ ఛైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్‌లు కొనసాగనున్నారు.

● సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా స్వర్ణ గ్రామానికి చెందిన అబ్దుల్ హాది, వైస్ ఛైర్మన్‌గా బీరవెల్లి గ్రామానికి చెందిన లక్కడి శంకర్‌రెడ్డిలను నియమించారు. సభ్యులుగా ఏనుగు ముత్యంరెడ్డి, సుభాష్‌రెడ్డి, సాద ప్రశాంత్, రాఠోడ్ పుష్ప, కొత్తకాపు పోతారెడ్డి, నేరడిగొండ శ్రీనివాస్, తాటి మహిపాల్, శిల సాయినాథ్, అహ్మద్ ముక్త్యార్, ఆత్రం నాగోరావు, పడిగెల కేదరినాథ్, అలూరు పీఏసీఎస్ ఛైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి, సారంగాపూర్ పంచాయతీ ప్రత్యేక అధికారి కొనసాగనున్నారు. నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కలకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కృతజ్ఞతలు చెప్పారు.

హామీ విస్మరించిన ప్రభుత్వం: ఎమ్మార్పీఎస్

నిర్మల్ అర్బన్: ఎస్సీ వర్గీకరణపై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును మొదట రాష్ట్రంలోనే అమలు చేస్తామని చెప్పిన సీఎం హామీ విస్మరించారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు నందకుమార్, మురళీకృష్ణ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నల్ల జెండాలతో కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఏవో సూర్యారావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొంతమంది నాయకుల మాటలు విని వర్గీకరణ విషయంలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మంద కృష్ణ మాదిగను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు బొబ్బిలి శ్రీను, శనిగరపు రవి, కాసారం దీపక్, శీను, సాయిచంద్, బాబు, గజేందర్, రాజు, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

చెత్త తొలగించండి..


రాజీవ్‌నగర్, ఓవైసీనగర్ నుంచి నిర్మల్ రహదారి వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెత్త, చెదారం

సమస్య : పట్టణంలోని రాజీవ్‌నగర్, ఓవైసీనగర్ నుంచి నిర్మల్ ప్రధాన రహదారివైపు వెళ్లే మార్గంలో చెత్త పేరుకుపోతోంది.

- గంగాధర్, రాజీవ్‌నగర్

సమాధానం : వెంటనే చెత్త తొలగిస్తాం. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

- బి.రాజేశ్ కుమార్, కమిషనర్, భైంసా

స్తంభం ఏర్పాట్లు చేశారు.. సమస్యను పరిష్కరించారు..


విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సారంగాపూర్, న్యూస్‌టుడే: 'చేతికందే ఎత్తులో తీగలు' శీర్షికన 'ఈనాడు'లో మేమున్నాం.. మీకు తోడుగా విభాగంలో ప్రచురితమైన సమస్యపై అధికారులు స్పందించారు. ఏఈ రాజేందర్ ఆదేశాలతో బుధవారం సిబ్బంది మండలంలోని చించోలి(ఎం) గ్రామ సమీపంలోని పంటక్షేత్రంలో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. వదులుగా ఉన్న తీగలను సరిచేశారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు

నిర్మల్ గ్రామీణం: మతిస్థిమితం సరిగ్గా లేని కుమారుడు తప్పిపోవడంతో ఆందోళనకు గురైన తల్లి డయల్ 100కు సమాచారం అందించడంతో నిర్మల్ గ్రామీణ పోలీసులు స్పందించారు. వైఎస్సార్ కాలనీకి చెందిన ఓ మహిళ తన ఏడేళ్ల కుమారుడు తప్పిపోయాడని డయల్ 100కు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్ చేశారు. తక్షణమే నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి స్పందించి కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్, సంచార బ్లూకోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వివిధ ప్రాంతాల్లో బాలుడి ఆచూకీ కోసం గాలించి గుర్తించారు. అదే రోజు రాత్రి బాలుడిని తల్లికి అప్పగించినట్లు ఎస్సై లింబాద్రి పేర్కొన్నారు.

వేతన బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదు

నిర్మల్ అర్బన్: ఒప్పంద కార్మికులు, సిబ్బంది వేతన బకాయిల చెల్లింపుల్లో నిర్లక్ష్యం సరికాదని పలువురు నాయకులు అన్నారు. బుధవారం స్థానిక 'పుర' కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, భారాస నాయకుడు గండ్రత్ రమేశ్, దివ్యాంగుల సంక్షేమ సంఘాల బాధ్యులు, పలువురు సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, ఇసాక్ అలీ, భగవాన్, ముత్యం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండగ

కుంటాల: కుంటాలలో మణికంఠ, ఛత్ర సేన యూత్ ఆధ్వర్యంలో బుధవారం బోనాల పండగ నిర్వహించారు. భాజాభజంత్రీలతో శోభాయాత్రగా గజ్జలమ్మ ఆలయానికి చేరుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారి నామస్మరణ చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మా చల్లంగా చూడు అంటూ ముడుపులు చెల్లించి మొక్కులుతీర్చుకున్నారు.

కాన్షీరాం ఆశయాలను కొనసాగిద్దాం

సారంగాపూర్: కాన్షీరాం ఆశయ లక్ష్యసాధనే ధ్యేయంగా ధర్మసమాజ్ పార్టీ ముందుకు సాగుతోందని ఆ పార్టీ మండల కన్వీనర్ కల్లూర్ సుధాకర్ అన్నారు. బుధవారం ధని గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాన్షీరాం వర్ధంతి నిర్వహించారు. నాయకులు కుందూరు వినోద్, జంగం సాయన్న, కత్తి శేఖర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద: రాచాపూర్‌లో బోనాలతో ఊరేగింపు


మామడ: పొన్కల్‌లో దుర్గామాతకు బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు


ఖానాపూర్ మండలం బాదనకుర్తిలో అమ్మవారి వేషధారణలో చిన్నారులు, బోనాలతో మహిళలు



భైంసా మండలం వానల్‌పాడ్‌లో స్వయంభువు దుర్గామాతను దర్శించుకుంటున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్

సరస్వతి దేవి అవతారం.. భక్తుల తన్మయత్వం

జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతి మాత రూపంలో దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన దేవీ మూర్తులకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అక్షరాభ్యాసాలు చేపట్టారు. పలు చోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం


కుంటాలలో కూరగాయలతో దుర్గామాతను అలంకరించిన భజరంగ్ దళ్ యూత్


ఖానాపూర్: ఇంద్రానగర్ గంగపుత్ర కాలనీలో జ్ఞాన సరస్వతి అవతారంలో దుర్గాదేవి


దస్తురాబాద్: కొత్తగూడెం దుర్గమ్మ చెంత చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న పండితులు


కడెం: లింగాపూర్ దుర్గాదేవి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్ చింత చెట్టులో స్వయంభువుగా వెలసిన శ్రీ సింహవాహిని విజయదుర్గా మాతను ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ బుధవారం దర్శించుకున్నారు. అర్చకుడు తీర్థప్రసాదాలను అందించారు. ఎంపీ, ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఖానాపూర్ మండలం తర్లపాడ్‌లో సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు


నిర్మల్: బేస్తవార్‌పేట్‌లో దీపోత్సవంలో భక్తులు


కుంటాల: విఠాపూర్‌లో దుర్గాసప్తశతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


రాజూరాలో దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చనలో మహిళలు

చెత్త పోగేసి.. పుర కార్యాలయంలో పడేసి..!

భాజపా వినూత్న నిరసన


తీసుకొచ్చిన చెత్తను పుర కార్యాలయం ఆవరణలో పడేస్తున్న నాయకులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా బకాయిలు పేరుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు సమ్మె బాట పట్టారు. వారం రోజులుగా పట్టణంలో చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ పేరుకుపోయి వీధులు కంపుకొడుతున్నాయి. సమస్య పరిష్కారానికి పాలకవర్గం, అధికారుల చొరవ కనిపించకపోవడంపై భాజపా ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తంచేస్తూ బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పలుచోట్ల రహదారిపై పేరుకుపోయిన చెత్తను వారే తొలగించారు. అంతా ఒకచోట పోగుచేసి వాహనంలో తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పడేశారు. పట్టణవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా బల్దియా ఉద్యోగులు, పాలకవర్గం అనుభవించాలని, అప్పుడే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటారని చెప్పారు.

చెరువుకట్ట పైనుంచి ఆటో బోల్తా

ఒకరి దుర్మరణం.. ఐదుగురికి గాయాలు


పంటపొలాల్లో బోల్తాపడిన ఆటో


క్షతగాత్రురాలు ఉమ (చికిత్స పొందుతూ మరణించారు)

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: మండల కేంద్ర ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం వడ్యాల్-రాచాపూర్ చెరువుకట్ట పైనుంచి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా. . ఐదుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆటో చోదకుడు సాదుల్లా తన కుటుంబసభ్యులతో పాటు, ప్రయాణికులతో నిర్మల్ నుంచి లక్ష్మణచాంద వైపు వెళ్తున్నారు. చెరువుకట్టపై ఆటో అదుపుతప్పి ప్రమాదవశాత్తు కట్ట కింద దాదాపు 20 అడుగుల లోతులో పంటపొలాల్లో బోల్తా కొట్టింది. ఆటోలో మల్లాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులతో పాటు మహిళ, పొట్టపెల్లి(కె) గ్రామానికి చెందిన ఉమ, లలిత, చోదకుడు ఉన్నారు. ఇరుక్కుపోయిన వీరందరినీ రహదారిపై వెళ్తున్నవారు గమనించి రక్షించారు. కట్ట కింద నుంచి పైకి తీసుకువచ్చి గాయపడిన వారిని 108 అంబులెన్సులో నిర్మల్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ ఉమ నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లోకేశ్వరం: మానసిక స్థితి సరిగా లేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ రెండు రోజులుగా చికిత్స పొందుతూ మరణించిన ఘటన మండలంలోని మన్మద్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం.. సితార్ల కవిత(32) మానసిక స్థితి సరిగా లేక సోమవారం ఇంట్లోనే పురుగు మందు తాగారు. కుటుంబీకులు భైంసా ఆసుపత్రికి తరలించారు. నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై వివరించారు. కవితకు భర్త భోజన్న, ఇద్దరు కూతుళ్లున్నారు.


నిర్మల్‌లో బతుకమ్మతో ఎస్పీ జానకి షర్మిల


చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడుతున్న ఖజానా శాఖ జిల్లా అధికారి సరోజ, పోలీసు ఉద్యోగులు


భైంసా మండలం పేండ్‌పల్లి గ్రామంలో బతుకమ్మకు హారతి ఇస్తున్న మహిళలు

పువ్వులనే పూజించడం విశేష సంప్రదాయం: ఎస్పీ

ఎక్కడైనా దైవాన్ని పువ్వులతో పూజిస్తుంటారు. కానీ, ఆ పువ్వులనే దైవంగా మార్చి పూజించడం తెలంగాణ ప్రాంత విశేష సంప్రదాయమని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. స్థానిక భరోసా కేంద్రంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, జిల్లా ఖజానాశాఖ అధికారి సరోజ, డీఎస్పీ గంగారెడ్డి, పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం


కుంటాల: పెంచికల్‌పాడ్‌లో


నిర్మల్: బతుకమ్మ ఆడుతున్న ప్రభుత్వ ఆస్పత్రి హెచ్‌వోడీ సరోజ, ఆర్ఎంవో సమత, డా.పూజ, నర్సింగ్ పర్యవేక్షకురాలు ధనలక్ష్మి, సీనియర్ నర్సింగ్ అధికారి జన, తదితరులు


ఖానాపూర్‌లో బతుకమ్మతో పుర ఛైర్మన్ చిన్నం సత్యం, అధికారులు, నాయకులు


భైంసాలో ఆర్టీసీ ఉద్యోగులు..

ఆవాసం అభివృద్ధికి సహకరిస్తాం: ఎంపీ

భైంసా: నిరాశ్రిత బాలురకు ఆశ్రయ కల్పించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న ఆవాసం నిర్వాహకుల సేవలు అభినందనీయమని ఎంపీ జి.నగేశ్ అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాసర వెళ్లిన ఆయన ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి పట్టణంలోని వివేకానంద ఆవాసాన్ని సందర్శించారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించి, విద్యాభ్యాసం అందిస్తున్న తీరును ఆవాసం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని మెరుగైన వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. అధ్యక్షుడు శైలేశ్ మాశెట్టివార్, కట్కం సాయినాథ్, మంతెన వెంకటేశ్, లింగన్న, లింగారెడ్డి, దేవేందర్ ఉన్నారు.

పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ గ్రామ శివారులో ఏర్పాటుచేయబోయే ఇథనాల్ పరిశ్రమకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని భారాస జిల్లా బాధ్యులు రాంకిషన్‌రెడ్డి కోరారు. బుధవారం దిలావర్‌పూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. రైతులకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కల్గించే పరిశ్రమను తరలించే వరకు ప్రజలకు మద్దతుగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు.

గోదావరి నీటిలో వ్యర్థ పదార్థాలు


గోదావరి నీటిలో నురుగు

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర గోదావరిలోకి బుధవారం మధ్యాహ్నం మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆల్కహాల్ కర్మాగారం వ్యర్థ పదార్థాలు వదలడంతో గోదావరి నీరు కలుషితమైంది. ఏటా వర్షాలు కురిసినప్పుడు వదిలేది. ఈసారి ఏకంగా మూలా నక్షత్రం సందర్భంగా భక్తులు వచ్చి స్నానాలు చేస్తుండగా నీటిలో ఒక్కసారి నురుగు వచ్చింది. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. గతంలో చాలాసార్లు ఇలాగే వ్యర్థాలను వదలడంతో భక్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి చాలా రోజుల వరకు వ్యర్థాలు అంతగా వదలలేదు. భక్తుల రద్దీలో వ్యర్థాలను వదిలితే ఎవరూ గుర్తించరని ఇలా చేసి ఉంటారని స్థానికులు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

తపాలా బీమాపై అవగాహన

మామడ: మండలంలోని పొన్కల్‌లో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తపాలా పథకాలు, ప్రమాదబీమాపై గ్రామస్థులకు ఆ శాఖ ప్రతినిధులు కల్యాణ్, సజన్‌సింగ్, లిఖిత వివరించారు. పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోండి

సారంగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని సారంగాపూర్ తహసీల్దార్ ఎస్.శ్రీదేవి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

నిర్మల్ పట్టణం: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో నిర్మల్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎ.మునీందర్‌రాజు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వైద్య సుహాసిని నియమితులయ్యారు.

కంటిచూపు కాపాడుకోవాలి

ఖానాపూర్: ప్రపంచ నేత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తెలంగాణచౌక్‌లో ముథోల్ ఐకేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుర ఛైర్మన్ సత్యం, కమిషనర్ మనోహర్, పలువురు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అవసరం

పెంబి: పర్యావరణ పరిరక్షణతోనే వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమని పెంబి రేంజ్ అధికారి రమేష్‌రావు పేర్కొన్నారు. వన్యప్రాణుల వారోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం మండలంలోని తాటిగూడా గ్రామంలో అవగాహన నిర్వహించారు. సెక్షన్ అధికారులు సుందర్, లింగారెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేత

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో బుధవారం సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులకు ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సమత సుదర్శన్ మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. సంస్థ సీఈఓ అనిల్, ఆర్గనైజర్ సాహెబ్ రావ్, ప్రభాకర్, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మిత్రుల ఆర్థిక సాయం

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు గైని రాందాస్ ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కేసీసీ మిత్ర బృందం సభ్యులు ఆ బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం రూ.57,000 ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్, భోజారాం పటేల్, నవీన్, రమేష్‌రెడ్డి, పరశురాం, రఘు, గోపి, వంశీకృష్ణ, వరుణ్, సునీల్‌గౌడ్, రమాకాంత్, సాయరెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

నూతన నియామకం

కడెం: ఇటీవల ఏర్పాటు చేసిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో కడెం మండలానికి చెందిన ఉపాధ్యాయులకు చోటు దక్కింది. లింగాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ వరుసగా మూడోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. కడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్రాములు, లింగాపూర్ ఉపాధ్యాయుడు ఎన్.ప్రభాకర్‌లు సైతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

కుభీరు: పిల్లలకు నిత్యం పోషకాహారం అందించాలని సూపర్‌వైజర్ సుగుణ పోషకులకు సూచించారు. కుభీరులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులను ఆమె పరీక్షించారు. పోషకాహారం లోపంతో బరువు, ఎత్తు పెరగకపోవటం లాంటి సమస్యలను గుర్తించారు.

వైకుంఠ రథం వితరణ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో చాట్ల దామోదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాట్ల లింగుబాయి, నర్సింలు జ్ఞాపకార్థం శ్రీనివాస్, చక్రపాణి, కరుణాకర్‌లు రూ.2.5 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని మండల వాసుల సౌకర్యార్థం గ్రామ పెద్దలకు అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


లోకేశ్వరంలో గురువులతో పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం: లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో 2010-11 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు బుధవారం పాఠశాలలో కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

ఎస్పీకి వీడీసీ సభ్యుల సన్మానం

సారంగాపూర్: ఎస్పీ జానకి షర్మిలను బుధవారం నిర్మల్‌లోని పోలీసు కార్యాలయంలో అడెల్లి వీడీసీ కమిటీ సభ్యులు కలిశారు. ఇటీవల గంగనీళ్ల జాతర ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతియుతంగా జరిగేలా చర్యలు చేపట్టిన ఎస్పీని వీడీసీ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కె.మాధవరావు, కె.రాకేష్‌రావు, వై.రాము, కె.నవీన్‌రావు, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ భరోసా.. విస్తరిస్తే బాగు



నిర్మల్, న్యూస్‌టుడే:

ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే దాదాపు 70 వేల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లగా తాజాగా కొత్తతరం కూడా ఎడారి దేశాల బాట పడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం లేని వారే ఆయా దేశాలకు వెళ్తుండటంతో వారంతా భవన నిర్మాణం, వ్యవసాయం వంటి పనుల్లో కుదురుతున్నారు. అక్కడి వాతావరణం, ఆహారం, తదితర పరిస్థితుల కారణంగా అనారోగ్యం, ఆపై మృత్యువాత పడుతున్న వారు కొందరైతే.. క్షణికావేశాలతో చేసే నేరాలతో జైళ్ల పాలవుతున్న వారు మరికొందరు. ఉమ్మడి జిల్లాలో ఏటా 30 నుంచి 40 మంది వరకు గుండెపోటు, మానసిక ఒత్తిడితో అనారోగ్యం కారణంగా చనిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంతో చనిపోయినా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. దీన్ని 7 డిసెంబరు 2023 నుంచి అమలు చేయాలని జీవో జారీ చేసింది. పరిహారం చెల్లించడానికి రూ.10.60 కోట్లు విడుదల చేసింది.

● రూ.5 లక్షల పరిహారంపై బాధిత కుటుంబాల వేడుకోలు..

మిగతా దేశాల్లో పనిచేసే కార్మికులకు వర్తింపజేయాలి

కేంద్రం ఇమిగ్రేషన్ యాక్టు-1983ను రూపొందించింది. ప్రస్తుతం రూ.5 లక్షల పరిహారం బ్రహెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మిగతా దేశాల్లోని కార్మికులకూ అమలు చేయాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు. అఫ్గనిస్తాన్, జోర్డాన్, లెబనాన్, లిబియా, మలేసియా, సుడాన్, సౌత్ సుడాన్, సిరియా, యెమెన్, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్, ఇజ్రాయిల్, కాంబోడియా, రష్యా, ఉక్రెయిన్, మల్దీవులు, తదితర దేశాల్లో ఉన్న వారికి కూడా వర్తింప చేయాలని విన్నవిస్తున్నారు. మరణించిన సమయంలో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగానికి సంబంధించి రుజువైన వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం వంటి ఆధారాలు సమర్పించాలనే నిబంధనతో చాలామంది ఆందోళనలో ఉన్నారు. ఆ దేశాల్లో యజమానులు పెట్టే బాధలు భరించలేక పారిపోయిన వారు కొందరు ఉండగా.. శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించిన ఏజెంట్లు సందర్శక (విజిట్) వీసాపై గల్ఫ్ దేశాలకు పంపించడంతో అక్కడ పనిలేక అక్రమ నివాసులుగా ఉన్నారు. వీరిందరికీ ఈ పరిహారం వర్తించకపోవడంతో వందల సంఖ్యలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి జిల్లా వలస కార్మికులు : సుమారు 70 వేలు

వలస కార్మికుల కుటుంబ సభ్యులు : 2.50 లక్షలు

ఉమ్మడి జిల్లాలో 7 డిసెంబరు 2023 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి సంఖ్య : 32

ఇవీ నిబంధనలు.. అర్హత ప్రమాణాలు

- గల్ఫ్ దేశాలైన బ్రహెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింపు
- మరణించిన గల్ఫ్ బాధితుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ప్రాధాన్యక్రమంగా చూసి పరిహారం అందజేస్తారు
- గల్ఫ్ కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు, ఉద్యోగం రుజువులు (వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం) ధ్రువపత్రాలు సమర్పించాలి.
- గల్ఫ్‌లో మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులు పరిహారం కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి. అర్హులైన దరఖాస్తుదారుల చెల్లుబాటు అయ్యే బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి.
- గల్ఫ్‌లో కార్మికుడి మరణం ధ్రువీకరించిన తర్వాత కలెక్టర్ అర్హత గల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపునకు ప్రొసిడింగ్ జారీ చేస్తారు.
- మృతి చెందిన తేదీ లేదా మృతదేహాన్ని స్వీకరించిన తేదీ నుంచి ఆరు నెలల లోపు కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి
- మంజూరైన రూ.5 లక్షలు అర్హత ఉన్న కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు నేరుగా బదిలీ చేస్తారు.

ఇతర దేశాలకు వర్తింప చేయాలి :



స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో పనిచేసే కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలి. సందర్శక వీసాపై వెళ్లి అక్కడ అక్రమంగా నివసిస్తూ మరణించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి సభ్యుల నియామకంలో విదేశాల్లో, స్వదేశంలో ఉన్న వారికి ప్రాతినిధ్యం కల్పించాలి. నకిలీ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారితోపాటు ఇక్కడున్న వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలి.



చంద్రపూర్‌లో సరిహద్దు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఐజీ దిలీప్ పాటిల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

● కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో మహారాష్ట్ర ఐజీ దిలీప్


బల్లార్ష, న్యూస్‌టుడే: త్వరలో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారులు సహకరించాలని నాగపూర్ ఐజీ దిలీప్ పాటిల్ అన్నారు. సరిహద్దు జిల్లాలైన కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో చంద్రపూర్‌లోని రేంజర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటు అందించాలన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దున కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయని, ఈ సరిహద్దున ఆరు చెక్‌పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇవి కాకుండా ఇతర మార్గాల ద్వారా మద్యం, డబ్బు అక్రమంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటిని నిరోధించేందుకు రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సరిహద్దు జిల్లాల అటవీ, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అవసరమైతే వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్పీ శ్రీనివాస్ పోతారం, కుమురంభీం జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, గడ్చిరోలి స్పెషల్ బ్రాంచి ఎస్పీ విశాల్ నాగర్‌గోజే, యావత్మాల్ ఎస్పీ పంకజ్ ఆసియా, చంద్రపూర్ కలెక్టర్ వినయ్‌గౌడ, ఎస్పీ సుదర్శన్ ముమ్ముక్కా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు చివరి తేదీ15

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15న చివరి తేదీ అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, సమన్వయకర్త గంగాధర్ తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 73829 29703 నంబరులో సంప్రదించాలన్నారు.

ఒకరితో ఒకరు పోటీపడి..

కొలువు కొట్టి!



కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

● ఆ కుటుంబాల నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు..

లక్ష్యం పెట్టుకుని ఇష్టంతో చదివితే విజయం సొంతమవుతుందని యువత నిరూపిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పోటీపడి మరీ చదివి ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. ఎంపికైన వారు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

భర్తను ఆదర్శంగా తీసుకుని..



భర్త, ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌తో శిరీష

ఖానాపూర్, ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీకి చెందిన నడిమట్ల లక్ష్మణ్ పెంబి మండలంలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. భర్తను ఆదర్శంగా తీసుకున్న శిరీష తాను కూడా ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికయ్యారు.

పాతికేళ్లలోపే కొలువు పట్టేశారు! : ఒకే ఇంటి నుంచి ఇద్దరు సోదరులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీరాములు-పద్మ దంపతుల కుమారులు నర్సర్‌వార్ అభిషేక్-అభిలాష్‌లు. వీరి అక్క బావ మౌనిక-నరేష్‌లు సైతం ఉపాధ్యాయులే. అభిషేక్ 13వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో, అభిలాష్ 72వ ర్యాంకుతో రిజర్వేషన్ కేటగిరిలో ఉద్యోగాలు సాధించారు. **- న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం**

నాడు అక్క.. నేడు ఇద్దరు చెల్లెలు



అక్కాచెల్లెలు సౌమ్య, కావ్య

కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన వ్యవసాయ దంపతులు గోలెం కళావతి-శ్రీనివాస్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. పెద్ద కుమార్తె సౌందర్య 2012 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. మిగతా ఇద్దరు కుమార్తెలు సౌమ్య, కావ్య.. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ ముగ్గురు కూడా స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 1-10 తరగతి వరకు చదువుకున్నారు. ఒకే కుటుంబం నుంచి ముచ్చటగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. అక్కను స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యంతో చదివినట్లు వారు తెలిపారు.

ఒకే కుటుంబంలో ఇద్దరు



తెలంగి నరేష్, నవీన్

ఖానాపూర్, ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బావాపూర్ ఆర్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముళ్లు తెలంగి నరేష్, నవీన్‌లు ఎస్జీటీలుగా ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో.. ఏడు సంవత్సరాల నిరీక్షణకు ఫలితం లభించినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

బాసరకు ఆధ్యాత్మిక శోభ

● ఘనంగా మూలా నక్షత్ర వేడుకలు



గోదావరి ఘాట్ వద్ద శివలింగానికి పూజలు



సామూహిక అక్షరాభ్యాసం



గోదావరిలో సూర్యనమస్కారం చేస్తున్న యువతి



అక్షరాభ్యాసం అనంతరం పలక, బలపంతో చిన్నారి



ప్రత్యేక అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు



కమలం పువ్వుతో భక్తురాలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: మూలా నక్షత్ర శుభ సమయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి చెంత అక్షర శ్రీకారానికి వచ్చిన చిన్నారులతో బాసర ఆలయం, అక్షరాభ్యాస మండపాలు కళకళలాడాయి. ఆలయంలో వేద మంత్రాలు, గోదావరిలో పుణ్యస్నానాలు, భక్తుల మొక్కులతో బుధవారం ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. వేకువజామున 2 గంటలకు మూలా నక్షత్ర పూజ చేసి అక్షరాభ్యాసాలు మొదలుపెట్టారు. ఉదయం భక్తుల రద్దీ నెలకొన్నా మధ్యాహ్నానికి తగ్గింది. అమ్మవారి దర్శనం, పూజలు, అక్షరాభ్యాసాలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు, కుంకుమార్చనలు, గంగమ్మ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలతో గోదావరి తీరం పులకించింది. సప్తమి ఘడియల్లో సరస్వతి అమ్మవారు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూట అమ్మవారికి రాజోపచార, చతుషష్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహా మంగళహారతి పూజలు శాస్త్రోక్తంగా చేశారు. సుమారు 30 వేలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందజేశారు. పిల్లలకు పాలు పట్టేందుకు బాలింతలకు ఫీడింగ్ గదులు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే భక్తుల తాకిడి తగ్గింది. వీఐపీ పాసులను నిలిపివేయడంతో హడావుడి లేకుండా క్యూలైన్ ముందుకు సాగింది. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లను తీసుకున్న వారికి ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయంలోని మహాకాళి దర్శనం కోసం వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేయడంతో భక్తులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సరస్వతి అమ్మవారిని ఎంపీ నగేష్, ముథోల్, సిర్పూర్(టి) ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, భారాస నాయకురాలు రమాదేవి, తెలంగాణ సినీ నటుడు రోషం బాలు, ఆయా పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చెందిన అతిథి గృహాలు అధికారులు, వీఐపీలకు కేటాయించడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా చాలా మంది భక్తులు బాసరకు రాలేదు. ఆలయ పక్షాన వసతి గదులు అందుబాటులో లేనందున ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులు ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేశారు.



దర్శనానికి వస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, తదితరులు

తగ్గిన అక్షరాభ్యాసాలు

గతేడాదితో పోలిస్తే భక్తుల రద్దీతో పాటు అక్షరాభ్యాసాలు కూడా తగ్గాయి. రూ.1000 ప్రత్యేక అక్షరాభ్యాసాలు 1621, రూ.150 అక్షరాభ్యాసాలు 609 నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 200 మంది చిన్నారులు అక్షరాభ్యాసాల టికెట్‌లు కొనుగోలు చేశారని ఆలయ ఈవో విజయరామారావు చెప్పారు. అక్షరాభ్యాసాలకు 2-4 గంటల సమయం పట్టింది. ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది 2739 అక్షరాభ్యాసాలు జరిగాయి. రూ.35 లక్షల ఆదాయం సమకూరింది.

వరి పొలంలో పులి కళేబరం

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సావిలీ అటవీ రేంజి పరిధి డోంగర్‌గావ్ గ్రామ పరిసరాలలోని వరి పొలంలో బుధవారం పులి కళేబరాన్ని రైతులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారమివ్వగా. . వారు కళేబరాన్ని చంద్రపూర్‌కు తరలించారు. చనిపోయింది ఆడ పులి అని, ఏడాదిన్నరేళ్ల వయసు ఉంటుందని పరీక్షల తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని సావిలీ అటవీ క్షేత్ర అధికారి వినోద్ దుర్వే తెలిపారు.



విధులకు వెళుతుంటే విధి వంచించింది

● జాతీయ రహదారిపై చెట్టును ఢీకొన్న కారు

● తండ్రి, కుమారుడి దుర్మరణం.. తీవ్రంగా గాయపడ్డ తల్లీకుమార్తెలు

లోకేశ్వరం/నర్సాపూర్(జి): న్యూస్‌టుడే: తెల్లవారుజామున లేచి విధులకు హాజరుకావాలన్న ఆలోచనతో హడావుడిగా భార్యాపిల్లలతో కారులో బయలుదేరిన విద్యుత్తు ఉద్యోగి కుటుంబాన్ని విధి వంచించింది. కారు ముందు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టిన ఘటనలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలవగా తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం మన్మద్ వాసి సంగం సురేశ్(28) మన్మద్ విద్యుత్తు ఉపకేంద్రంలో ఆపరేటరుగా పనిచేస్తున్నారు. మంగళవారం భార్య ప్రియాంక, కుమారుడు సాయివర్షిక్, కూతురు తనిష్కలతో కలిసి అత్తగారి ఊరైన బోథ్ మండలం కుచులాపూర్ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉన్నారు. బుధవారం విధులకు హాజరయ్యేందుకు ఉదయమే భార్యాపిల్లలతో తన సొంత కారులో మన్మద్ బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో నర్సాపూర్(జి) మండలం నందన్ దాటగానే కారు ముందు టైరు పగిలింది. అతివేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ కుమారుడు సాయివర్షిక్(6) అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడ్డ సురేశ్, భార్య ప్రియాంక, కూతురు తనిష్కలను స్థానికులు అంబులెన్సులో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే సురేశ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలైన ప్రియాంకకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. తనిష్క నిర్మల్‌లో చికిత్స పొందుతోంది. సురేశ్ అత్త మచ్చెర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



సంగం సురేశ్



సాయివర్షిక్



నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

మన్మద్‌లో విషాదఛాయలు..

అందరితో కలుపుగోలుగా ఉండే సురేశ్‌తో పాటు చిరునవ్వులు చిందించే సాయివర్షిక్‌లు మృతి విషయం తెలియగానే మన్మద్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రమాద తీరును చూసి చలించారు.

పంట నష్టపరిహారం మంజూరు

జిల్లా	ఎకరాలు	రైతులు	పరిహారం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	3096	2041	3.09
కుమురం భీం	2692	1371	2.69
మంచిర్యాల	598	447	0.59

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా కురిసిన వర్షాలతో వాగులతో పాటు సరిహద్దులో ఉన్న పెన్‌గంగ ఉద్ధృతి కారణంగా పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులు పంటలను నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల వారీగా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించారు. ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందించనున్నారు.

పట్టగొలుసు మింగిన చిన్నారి.. తప్పిన ప్రాణాపాయం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : ఏడు నెలల చిన్నారి పట్టగొలుసు మింగటంతో గొంతులో ఇరుక్కొని ప్రాణాపాయంగా మారగా ఆదిలాబాద్ రిమ్స్ వైద్యులు చాకచక్యంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. గుడిహత్నూర్‌కు చెందిన ధ్రుతి(7 నెలలు) కాలికి ఉన్న వెండి పట్టగొలుసును నోట్లో పెట్టుకోవడంతో బుధవారం గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు పాపను రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేసే మామిడి హేమంతరావు(ఈఎన్‌టీ) చాకచక్యంగా ఎండోస్కోపి చేసి గొంతులో ఇరుక్కున్న పట్టగొలుసును బయటకు తీశారు. రిమ్స్ సంచాలకుడు జైసింగ్ రాథోడ్ వైద్యుడు హేమంతరావును అభినందించారు.



ప్రాణాపాయం తప్పిన చిన్నారి ధ్రుతి



ఏడు నెలల చిన్నారి గొంతులో ఇరుక్కున్న వెండి పట్టగొలుసు